అభివృద్ధి పనుల్లో పురోగతి తప్పనిసరి

పెదపాడు : మండలంలో అభివృద్ధి, సంక్షేమ పనుల్లో పురోగతి తప్పనిసరి అని, ఆదిశగా అధికారులు ముందుకు సాగాలని ఎంపీపీ బత్తుల రత్నకుమారి, జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో శాఖలవారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలు పరిష్కారం ఎంత వరకు జరిగిందో తెలపాలని చెప్పారు. ఈసందర్భంగా ఎంపీపీ రత్నకుమారి, జెడ్పీటీసీ పద్మశ్రీ ప్రసాదరావు మాట్లాడుతూ మండలంలో 5 ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 22 నుంచి 28వరకు జరిగే డ్వాక్రా ఎగ్జిబిషన్లో 10 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. చేపల వ్యాపారం చేసేందుకు మత్స్యశాఖ ద్వారా రుణాలు అందిస్తున్నట్లు వివరించారు. మునగ మొక్కలు ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు. మండలంలోని రహదారుల నిర్మాణం వేగవంతం చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. లోయేరు డ్రెయిన్ ఎగువన ఉన్న 500 ఎకరాలు పంట భూములు నీట మునుగుతున్నాయని, దీనివల్ల రైతులు నష్టపోతున్నారని డ్రెయిన్ అభివృద్ధి చేయాలని కోరారు. హౌసింగ్ కాలనీల్లో నీటి సౌకర్యాలు కల్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశించారు. హౌసింగ్ ఏఈలను పదేపదే బదిలీ చేయడం కారణంగా ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి లేకుండా పోయిందని, దీనివల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపాలని కోరారు. మండలంలో పంచాయతీ రాజ్ ఏఈని నియమించాలన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు అప్పన పద్మావతి, రెడ్డి స్వర్ణకుమారి, సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, ఎంపీటీసీలు అక్కినేని గోపీ చంద్ర దుర్గాప్రసాద్, పూడి అప్పల స్వామి, తహసీల్దార్ జి.విజయకుమార్‌రాజు, ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు సమాచారం లేకుంటే ఎలా

దెందులూరు : ప్రభుత్వపరంగా శాఖలవారీగా కార్యక్రమాలు ఆయా ఎంపీపీ, జెడ్పీటీసీలకు గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలకు తెలియజేయకుంటే ఎలా అని అధికారులపై జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎంపీపీ సుమలత అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పోతునూరు ఎంపీటీసీ సున్నా నరేష్ మాట్లాడుతూ దళిత వీధిలో విద్యుత్ స్థంబాలు శిథిలావస్థలో ఉన్నాయని, మార్చాలని ఎన్నిసార్లు చెప్పినా సిబ్బంది స్పందించడం లేదని మండిపడ్డారు. దీనిపై వివరణ కోరగా విద్యుత్ ఏఈ సమావేశానికి హాజరుకాకపోవడంతో ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలు పరిష్కరించకపోగా సర్వసభ్య సమావేశానికి హాజరుకాకపోవడం ఏంటని ప్రశ్నించారు. అనంతరం మండల వ్యవసాయశాఖ అధికారి గద్దె రమేష్ మండలానికి 8 ట్రాక్టర్లు ఇచ్చామని చెప్పగానే జెడ్పీటీసీ, ఎంపీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరితో పంపిణీ చేయాల్సిన అవసరం లేదా అని మండిపడ్డారు. సమావేశంలో వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, తహశీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, ఏఈపీఆర్ చౌదరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేంద్ర పాల్గొన్నారు.



మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి

మద్దతు ధర గ్యారంటీ చట్టం తీసుకురావాలి


రైతు సంఘం సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు

గణపవరం : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రైతు పండించిన పంటకు మద్దతు ధర ప్రకటించి, మద్దతు ధర అమలుకు గ్యారంటీ చట్టం తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సమావేశం డిమాండ్ చేసింది. మంగళవారం పిప్పరలో జరిగిన మండల రైతు సంఘం సమావేశంలో జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు పాల్గొని మాట్లాడారు. జిల్లాలో రైతుల వద్ద నుంచి సార్వా ధాన్యం పూర్తిగా కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతు సంఘం జిల్లా నాయకుడు గుత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుకు ధాన్యం సొమ్ములతో పాటు ఖర్చులు కూడా చెల్లించాలని, ఈ విషయంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే రైతు ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. పి.నర్సింహమూర్తి, కేతాశ్రీనివాస్, ముప్పిడి సంజీవరావు, పెట్ట బాబూరావు, మండల రైతుసంఘం అధ్యక్షుడు మెంటే సూర్యారావు పాల్గొన్నారు.

దేవస్థానాల పాలకమండలిలో బీసీలకు చోటు


తొత్తడి వేదకుమారి


ముస్సే శ్రీను

దెందులూరు : నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చొరవతో ఇద్దరు బీసీ నేతలకు రాష్ట్రంలో రెండు ప్రముఖ దేవాలయాల్లోని పాలకమండలిలో చోటు కల్పించారు. విజయవాడ కనకదుర్గమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యురాలిగా మాజీ సర్పంచ్, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ దెందులూరు మహిళా అధ్యక్షురాలు తొత్తడి వేదకుమారి (బీసీ–కొప్పులవెలమ)ని నియమించారు. ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం కమిటీ సభ్యునిగా వేగివాడ మాజీ ఎంపీటీసీ ముస్సే శ్రీను (బీసీ–యాదవ)ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జీవోను జారీ చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జానంపేట బాబు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, అప్పన్న ప్రసాద్, తేరా ఆనంద్, మెట్లపల్లి సూరిబాబు పదవులు పొందిన బీసీ నేతలను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

కెరీర్ గైడెన్స్ వర్క్‌షాప్

దెందులూరు : యువత సరైన మార్గ నిర్దేశం చేసుకుని భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సెట్‌వెల్ సీఈఓ మెహర్రాజ్ అన్నారు. మంగళవారం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో వేగవరంలోని హేలాపురి ఇంజనీరింగ్ కళాశాలలో కెరీర్ గైడెన్స్ వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా యువజన అధికారి డీ.కిషోర్ పోటీ పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధం కావాలో విద్యార్థులకు వివరించారు. జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ మధు భూషణ్, టూరిజం మేనేజర్ పట్టాభి, కళాశాల ప్రొఫెసర్ శ్రీనివాస్, ఏవో టీఎస్. కరుణానిధి తదితరులు పాల్గొన్నారు.

దళితులకు రక్షణ కల్పించాలి

గణపవరం : దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని దళితులపై అగ్రవర్ణ దాడులను అరికట్టాలని, దళితులకు రక్షణ కల్పించాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పిప్పరలో మాలమహానాడు, దళిత ప్రజా సంఘాల నాయకులు సమావేశమై దళితులపై జరుగుతున్న దాడులను ఖండించారు. ఎస్సీలలోని మాలమాదిగ కులాల వారు క్రైస్తవులుగా మారితే వారిని బీసీలుగా గుర్తిస్తున్నారని, ఇది తగదని అన్నారు. దళిత క్రైస్తవులను ఎస్సీలుగానే గుర్తించాలని డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మోటార్‌సైక్లిస్ట్ మృతి

ఉంగుటూరు : జాతీయ రహదారిపై కైకరం – పూళ్ల గ్రామాల మధ్య గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ మోటార్‌సైక్లిస్ట్ మృతి చెందాడు. ఈ ప్రమాదం సోమవారం అర్ధరాత్రి జరిగింది. వివరాల ప్రకారం భీమడోలు మండల అర్జవారిగూడెంకు చెందిన మెరుగుజాన్‌రాజు దైవమని (48) భీమవరం వెళ్లి తిరిగి వస్తుండగా కైకరం టన్నెలు ప్రాంతంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో జాన్‌రాజు అక్కడికక్కడే మృతిచెందాడు. అతనికి భార్య కమల, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. చేబ్రోలు ఎస్సై స్వామి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

పెదవేగి : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల ప్రకారం గ్రామంలో మండలంలోని రామశింగవరం గ్రామంలో కోళ్లఫారం వద్ద మంగళవారం రాత్రి పంపన బాలాజీ(30) పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయాన్ని గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పెదవేగి ఎస్సై లక్ష్మణ్ చెప్పారు.

క్లుప్తంగా

చేనేత కార్మికులు ఐక్యంగా ఉండాలి

ఉంగుటూరు : చేనేత కార్మికులు రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం ఉంగుటూరులో ఆ సంఘ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దొంతంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఉంగుటూరు నియోజకవర్గంలో 6500 మంది చేనేత కార్మికులు ఉన్నారని, వారి సంక్షేమానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. చేనేత సభ నిమిత్తం త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. పద్మశాల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వానపల్లి నాగరాజు, చేనేత సంఘం నాయకుడు, ఎంపీటీసీ బండారు నాగరాజు, పద్మశాలి, దేవాంగ, కర్ణభక్తు కులస్తులు పాల్గొనారు.

సచివాలయ ఉద్యోగికి సత్కారం


సచివాలయ ఉద్యోగి ప్రసన్న లక్ష్మిని సత్కరిస్తున్న దృశ్యం

ఉంగుటూరు : జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా గొల్లగూడెం గ్రామ పంచాయతీలో మంగళవారం డస్ట్‌బిన్‌లు పంపిణీ చేశారు. తడిచెత్త, పొడిచెత్త సేకరణకోసం పలువురు దాతల సాయంతో కొనుగోలు చేసిన డస్ట్‌బిన్‌లను గ్రామస్తులకు అందజేశారు. అనంతరం సర్పంచ్ కరపా వెంకట శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసాపత్రం అందుకున్న సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ సీహెచ్ ప్రసన్న లక్ష్మిని గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట రమణ, ఈవోపీఆర్‌డీ షంషుద్దీన్, సొసైటీ డైరెక్టర్ దాసరి సత్యనారాయణ, మలకలపల్లి నాగేశ్వరరావు, ఈదల రమేష్, కాండ్రు రాము, కడారి నరసింహమూర్తి, విడియాల శ్రీను, దాసరి రాజశేఖర్, గన్నమని తులసీదాసు, పంచాయతీ కార్యదర్శి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కొఠారు పరామర్శ

దెందులూరు : అనారోగ్యంతో బాధపడుతున్న దోసపాడు వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు చమలమూడి ఏసుపాదంను మంగళవారం ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు తీసుకుని త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట జడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, ఎంపీటీసీ పెద్దిశెట్టి రోహిణి, పార్టీ శ్రేణులు ఉన్నారు.

సినీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

దెందులూరు: విజయవాడలో నూతనంగా టీవీ, నాటకరంగ సంస్థల చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న పోసాని కృష్ణమురళిని మంగళవారం కలిసినట్లు ఉభయగోదావరి జిల్లాల సినీ కార్మికులు, నాటక రంగ యూనియన్ అధ్యక్షుడు కాకర్ల శ్రీను ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సినీ కార్మికుల సమస్యలతో పాటు నాటకరంగ, కళాకారుల సమస్యలు పరిష్కరించాలని, వయోభారం ప్రాధాన్యతగా తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన కళాకారుల సమస్యలపై వినతిపత్రం అందజేశానని, తన వంతు కృషి చేస్తానని కృష్ణమురళి హామీ ఇచ్చినట్లు శ్రీను తెలిపారు.

మట్టి అక్రమ తవ్వకాలు నిలుపుదల చేయాలని వినతి

ఉంగుటూరు : అటవీభూముల్లో జరుగుతున్న అక్రమ మట్టితవ్వకాలు నిలుపుదచేయాలని కోరుతూ వనసంరక్షణ సమితి సభ్యులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు. వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ పెదవెల్లమిల్లి, చిన్న వెల్లమిల్లి పరిధిలో ఉన్న వీఎస్ఎస్ భూముల్లో అక్రమార్కులు మట్టిని తవ్వుతున్నారని, దీనికి అటవీశాఖ అధికార్లు సహకరిస్తున్నారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని రామకృష్ణ కోరారు. కార్యాక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.వెంకట్రావు, కె.అంజియ్య, పి.ప్రసాద్‌రావు, వి.రవి, డి,నాగేశ్వరరావు, వి.రామయ్య పాల్గొన్నారు.

పాల వెల్లువ ద్వారా ఆర్థిక స్వావలంబన

భీమడోలు : జగనన్న పాల వెల్లువ ద్వారా పాడి రైతులు ఆర్థిక స్వావలంబన సాధిస్తారని జిల్లా డీసీవో ప్రవీణ అన్నారు. పోలసానిపల్లి, గుండుగొలను గ్రామాల్లో పనిచేయని పాల కేంద్రాలను పునః ప్రారంభించేందుకు సంబంధిత ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందితో ఎంపీడీవో జీఎల్ఎస్‌వీ రాఘవన్‌తో కలిసి ఆమె సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీవో ప్రవీణ మాట్లాడుతూ పోలసానిపల్లి, గుండుగొలను గ్రామాల్లో ఈనెల 11వతేదీ నుంచి రైతుల నుంచి పాలను సేకరించాలన్నారు.

మునగ మొక్కల పంపిణీ

భీమడోలు : బహుళ ఔషధ ప్రయోజనాలు కలిగిన మునగ చెట్లను ప్రతి ఇంటా పెంచి సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని జిల్లా డ్వామా పీడీ కె.రాంబాబు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం భీమడోలు నర్సరీలో డ్వామా ఆధ్వర్యంలో సిద్ధం చేసిన మునగ మొక్కలను మహిళలకు పంపిణీ చేశారు. సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన డ్వామా పీడీ కె.రాంబాబు మాట్లాడారు. ప్రతి మహిళకు 2 నుంచి 5 మొక్కలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. జెడ్పీటీసీ భవానీ రంగా తదితరులు పాల్గొన్నారు.

వసంతకుమార్ మృతి తీరని లోటు

భీమడోలు : మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ మృతి తీరని లోటు అని పలువురు వక్తలు అన్నారు. పూళ్ల పంచాయతీ కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్ సీపీ పంచాయతీ పాలకవర్గం, ఎంపీటీసీలు వట్టి వసంతకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.